క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కన్యకాపరమేశ్వరి జయంతి



కన్యకాపరమేశ్వరి అమ్మవారికి నివేదించిన 108 రకాల స్వీట్స్

దాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని ఆర్య వైశ్య యువజన సంఘం, వాసవీ కల్యాణ మండప సంఘం, వాసవీ విజ్ఞాన మండలి, ఆర్య వైశ్య సమాజం, ఆర్య వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు వివిధ వాసవీ క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి నిర్వహించినట్టు దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్ తెలిపారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని ఆలయంలో వేకువ జాము 3 గంటలకు సుప్రభాతంతో మొదలై అనంతరం ప్రత్యేక క్షీరాభిషేకం, ఉత్సవ మూర్తికి భక్తులచే స్వయంగా క్షీరాభిషేకం, అమ్మవారి మూలవిరాట్‌కు రజత వస్త్రాలంకరణ, 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలు, 102 మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు, వాసవీ మూల మంత్ర హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు 108 రకాల స్వీట్స్‌తో అమ్మవారికి నివేదన చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు బాదం దినేష్, డాక్టర్ గోగుల సువర్ణ కుమార్, కడిమిశెట్టి నవీన్, కొల్లూరు వెంకట రత్నం, బొడ్డు రఘు, నల్లూరి నూకరాజు, పెనుగొండ కామరాజు, పాలూరి వర్ధనబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందనలు



క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతున్న ఎస్. కిరణ్మయి, సీహెచ్ శాంతి ఫణి ఎన్‌సీసీలో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 3 నుంచి 14 వరకు పెద్దాపురంలో జరిగిన ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ చాంపియన్‌షిప్ క్యాంప్‌లో నిర్వహించిన ఫైరింగ్‌లో ప్రతిభ చూపారు. శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, ఎన్‌సీసీ అధికారి కె. గీతాంజలి అభినందించారు.



ఏళ్లనాటి సీతారామచంద్ర హనుమత్ లక్ష్మణ స్వామి విగ్రహాలు



అపురూప కళాఖండాలు



ప్లాస్టిక్ వద్దని చెబుతూ రూపొందించిన ప్రతిమలు



ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు రూపొందించిన సచిన్ టెండూల్కర్ ఫైబర్ విగ్రహం

నాటి ప్రపంచం.. నేడు ఆవిష్కృతం

- మన పూర్వీకుల గురించి చెబుతున్న విశాఖ మ్యూజియం
- కళ్ల ముందు అలనాటి రాజుల ఘనతలు .. సైన్స్ సంగతులు
- ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్న వీక్షకులు

గడిచిపోయిన చరిత్ర **ఆనవాళ్లను.. నాటి** అనుభూతులను **తర్వాతి తరాల** ముందు ఉంచేవే **మ్యూజియంలు.** మన తాత ముత్తాతల **కాలంలోని** రాజులు.. **రాజ్యాలు.. నాటి ప్రజల** జీవన సరళి.. ఇలా **ఒకటేమిటి నాటి** సమాజంలోని ప్రతి **ఒక్క** జ్ఞాపకాన్ని కళ్ల **ముందు ఉంచి** అప్పటి సంగతులను **కథలు** కథలుగా చెబుతూ **అనుభూతుల** సరాగాలు **పాడిస్తాయి.**



నేవీ యుద్ధ నౌకల వివరాల బోర్డు

దాబాగార్డెన్స్ : మన పూర్వీకుల సంస్కృతీ సంప్రదాయాలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో వారు సాధించిన ప్రగతిని విశాఖ మ్యూజియం నేటికీ మన కళ్ల ముందు ఆవిష్కరిస్తోంది. 1991లో ప్రారంభమైన ఈ మ్యూజియంలో వందల ఏళ్లనాటి కళాఖండాలు, సంస్కృతిని ప్రతిబింబించే శిల్పాల వంటి ఎన్నో ప్రత్యేక ఆకర్షణలున్నాయి.

తప్పక వీక్షించాల్సినవి..

- ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ఫైబర్‌తో సచిన్‌టెండూల్కర్ విగ్రహాన్ని రూపొందించారు. నిజంగా సచినే వచ్చి నిల్చున్నాడా అనే రీతిలో ఉంటుంది విగ్రహం
- 1840లో గోడే వెంకట జగ్గారావు స్థాపించిన నక్షత్రశాల చిత్రపటం
- 1902–37 మధ్య కాలంలో విజయనగరం సామ్రాజ్యానికి చెందిన ఖడ్గాలు, తుపాకులు, ఇతర యుద్ధ సామగ్రి



అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి మ్యూజియంను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

రూ.కోటితో ఆధునికీకరణ..

విశాఖ మహానగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విశాఖ మ్యూజియంను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు జీవీఎంసీ ఇటీవల రూ.కోటితో ఆధునికీకరించింది. గత ఫిబ్రవరిలో విశాఖలో నిర్వహించిన మిలాన్–2024 కార్యక్రమాలకు వివిధ దేశాల ప్రతినిధులు విశాఖ విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని, విశాఖ ప్రజలు వీక్షించేందుకు గాను మ్యూజియంకు మరమ్మతులు చేపట్టారు. పురాతన విగ్రహాలు మరింత అందంగా ప్రదర్శించేందుకు ప్రత్యేకించి ఫోకస్ లైట్లు ఏర్పాటు చేశారు. మ్యూజియం ఆవరణలో అందమైన, నీడనిచ్చే పెద్ద పెద్ద మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. మ్యూజియంలో చరిత్ర గల పురాతన వస్తువులు, విలువైన కళాఖండాలను అందంగా అమర్చారు.

చూసి తీరాల్సిందే..

- మేరీటైం మ్యూజియం.. ఇది విశాఖ మ్యూజియంలో అంతర్భాగం. భారత నావికా దళానికి సంబంధించినది. **తొలితరం** ఆవిష్కరణలను **యుద్ధ మజిలీలను ప్రజల** ముందు ఆవిష్కరించేందుకు **ఒక మ్యూజియం** ఏర్పాటు చేయాలని **తూర్పు నావికాదళం భావించింది.** ఇది 2004లో **ప్రారంభమైంది.**
- **1400 డిగ్రీల ఉష్ణోగ్రతను** సైతం తట్టుకునే విధంగా **తయారు చేసిన ప్రాక్సిమిట్** సూట్ (దీని బరువు 6.5 కిలోలు)
- శ్వాస పరికరాలతో కూడిన హైడ్రోజన్ సూట్. సముద్ర గర్భంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఈ సూట్‌ను ధరించి 120 అడుగుల లోతులో ఉన్న జలాంతర్గాముల నుంచి సురక్షితంగా బయటపడొచ్చు.
- తొలితరం యుద్ధ నౌకల్లో వినియోగించిన అధునాతనప మిషన్‌గన్స్

ఎక్కడ ఉంది: బీచ్‌రోడ్డు.. పార్క్ హోటల్ వద్ద
వేళలు: ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకు
శని, ఆదివారాల్లో ఉదయం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు
ప్రవేశ రుసుం : పెద్దలకు రూ.10
పిల్లలకు (5 నుంచి 12 ఏళ్లలోపు) రూ.5



జీవం ఉట్టిపడుతున్న మత్స్యకార మహిళల ప్రతిమలు

వైభవంగా శ్రీ వాసవీ మాత జయంతి



వాసవీ మాత పూజలో పాల్గొన్న భక్తులు



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్

అల్లిపురం : శ్రీ వాసవీ మాత జయంతి వేడుకలు వైర్‌లెస్ కాలనీలోని శ్రీ రామాలయంలో శనివారం వైభవంగా నిర్వహించారు. అక్కయ్యపాలెం నందగిరినగర్‌కు చెందిన శ్రీ వాసవాంబిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా అమ్మవారి చిత్రపటాన్ని అలంకరించారు. అనంతరం నిర్వహించిన కుంకుమపూజలో సుమారు 200 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహస్ర నామాచార్చన, అష్టోత్తరం చేపట్టారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొని భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవతగా సర్వమంగళ సౌభాగ్య ప్రదాయినిగా అవతరించిన కన్యకా పరమేశ్వరి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఎవరు పూజిస్తారో వారికి సర్వసౌభాగ్యాలు కలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యలమర్తి గణేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.సుబ్రహ్మణ్యం, శ్రీ వాసవాంబికా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు ఎ.సత్యారావు, కార్యదర్శి ఎల్.నాగేశ్వరరావు, కోశాధికారి కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.41 లక్షలు



హుండీలు లెక్కిస్తున్న అధికారులు

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం రెండు నెలలకుగాను 1 లక్ష 41 వేల 224 రూపాయలు లభించినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. శనివారం దేవాలయం ఆవరణలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీఎల్ఎన్ రాజు సమక్షంలో హుండీలు లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జోగారావుశర్మ, శ్రీ హరి సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి అంకురార్పణ

బల్లిగిరి వెంకన్న సన్నిధిలో వేడుకలు



వార్షిక తిరుకల్యాణోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలకు శనివారం అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజన సేవ, నూతన వస్త్రాలంకరణ, స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా తీర్చిదిద్దారు. సాయంత్రం దేవస్థానం మండపంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు, వేదపండితులు ఉత్సవ సంకల్పం చేపట్టారు. ఈ సందర్భంగా విశ్వక్షేణపూజ, పుణ్యాహవచనం, స్థల శుద్ధి మృత్సం గ్రహణం, అంకురార్పణ, వాస్తు మండపారాధన పూజ, అధివాసములు, అగ్నిప్రతిష్ట, విశేష హోమాలు, నివేదన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి, సిబ్బంది రవి, సేవకులు రాంబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు తిరుకల్యాణోత్సవం..

శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం సాయంత్రం 7 గంటల నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో జీవీ రమాబాయి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు.



విశేష అలంకరణలో బల్లిగిరి వెంకన్న

కిటకిటలాడిన దేవాలయం..

వైశాఖ మాసం రెండవ శనివారం సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వెవేంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు.

అభివృద్ధి పథంలో.. వన్‌టౌన్

- శరవేగంగా ప్రధాన రహదారి విస్తరణ
- కాలువల నిర్మాణం.. ఫుట్‌పాత్‌ల ఏర్పాటు
- రూ. 12 కోట్లతో ఆధునికీకరణ పనులు



విస్తరణకు ముందు వన్‌టౌన్ రహదారి



విస్తరణ తర్వాత వన్‌టౌన్ రహదారి



నిర్మాణ దశలో కాలువలు

అభివృద్ధికి చేస్తున్న మొత్తం వ్యయం : రూ. 12 కోట్లు

రహదారి విస్తరణకు :	కాలువల నిర్మాణానికి :
రూ. 4.50 కోట్లు	రూ. 4.50 కోట్లు

ఫుట్‌పాత్‌ల ఏర్పాటుకు : రూ. 3 కోట్లు



పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్

జగదాంబ : పాతనగరం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. రోడ్ల నిర్మాణం, ప్రధాన జంక్షన్ల ఏర్పాటు, రహదారులు, మున్సిపల్ స్టేడియం ఆధునికీకరణ, కల్యాణ మండపాల నవీకరణ, వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారి విస్తరణ వంటి పనులతో పాతనగరం కొత్త రూపు సంతరించుకుంటోంది. ముఖ్యంగా వన్‌టౌన్ ప్రధాన రహదారి విస్తరణ గురించి చెప్పుకోవాలి. ఈ రోడ్డు విస్తరణకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. గత ప్రభుత్వంలో నాయకులు వన్‌టౌన్ రహదారి విస్తరణ అని చెప్పేవారే కానీ కచ్చితంగా ఎంత విస్తరణ జరుగుతుందో చెప్పకపోవడంతో ఇక్కడి వ్యాపారులు తమ వ్యాపారాలకు ఎక్కడ సమస్య వచ్చి పడుతుందో అని ఆందోళనకు గురయ్యేవారు.

తీపి కబురు చెప్పిన వైఎస్సార్‌సీపీ..

ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడి వ్యాపారుల నెత్తిన పాలు పోసింది. 60 అడుగులకు మాత్రమే కుదించి రోడ్డు విస్తరిస్తామని ప్రకటించింది. దీంతో వ్యాపారులు సంతోషించారు. అలా చేస్తే తమ వ్యాపారాలకు ఎలాంటి ఢోకా ఉండదనుకున్నారు.

జగదాంబ నుంచి చూస్తే పాతనగరం కనబడేలా..

జగదాంబ నుంచి చూస్తే పాతనగరం కనబడేలా వన్‌టౌన్ రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. ఇప్పటికే జగదాంబ నుంచి టర్నర్ చౌల్ట్రీ వరకు అరవై అడుగుల తారు రోడ్డు నిర్మాణం కూడా జరిగిపోయింది. మరో పక్క పాదచారులకు అనుకూలంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం జరుగుతోంది. విద్యుత్ సదుపాయం కోసం కొత్తగా హైటవర్ పోల్స్ ఏర్పాటు చేశారు. ఈ విధంగా పాతనగరం కొత్తందాలు సంతరించుకుంటోంది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశం



పందుపుల్లల సందు వద్ద చెత్త ఎత్తిస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్

జగదాంబ : చెత్త కుప్పలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ అన్నారు. శనివారం జోన్ పరిధిలో 35వ వార్డులో పర్యటించారు. పందుపుల్లల సందు, వన్‌టౌన్ ప్రధాన రహదారి, పూర్ణామార్కెట్ ప్రాంతాలను పరిశీలించారు. రహదారి పక్కన ఉన్న చెత్త కుప్పలను పారిశుధ్య సిబ్బందితో ఎత్తించి డంపింగ్ యార్డుకు తరలించారు. వార్డులో రహదారులు, కాలువలు పరిశుభ్రంగా ఉండాలని వార్డు ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులకు ఆదేశించారు. కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ లేకుండా పరిశుభ్రం చేస్తే ఎక్కడా మురుగు, నీరు నిల్వ ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలి..

జీవీఎంసీ 39వ వార్డులో ప్రజా మరుగుదొడ్లను జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ శనివారం పరిశీలించారు. మరుగుదొడ్లలో కచ్చితంగా నీటి సదుపాయం ఉండాలన్నారు. ఫినాయిల్, బ్లీచింగ్ వంటివి ఎప్పటిప్పుడు వేసి దుర్వాసన లేకుండా చూడాలన్నారు. మహిళలకు ఇబ్బంది లేకుండా మహిళల మరుగుదొడ్ల వద్ద మహిళలే ఉండాలన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

సీతమ్మధార: ఓ బాలిక అదృశ్యంపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురంలో తల్లి కన్నెంటి పద్మతో కలిసి కుమార్తె కీర్తిక నివసిస్తోంది. బాలిక పదో తరగతి చదువుకుంది. గతంలో ఒక దుస్తుల దుకాణంలో పనిచేసేది. అక్కడ పనిమానేయండతో తనకు రావాల్సిన డబ్బుల కోసం ఈ నెల 17వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో దుకాణానికి వెళ్లి వస్తానన్న కీర్తిక సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో తల్లి బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్దకు వెళ్లి అడగ్గా రాలేదని చెప్పారు. దుస్తుల షాపు యాజమానికి అడగ్గా బాలిక రాలేదని చెప్పడంతో తల్లి పద్మ కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థికి ప్రీస్కూల్ అత్యంత కీలకం

ఎంవీపీకాలనీ: ప్రతి విద్యార్థికి ప్రీస్కూల్ విద్య అత్యంత కీలకమని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జీవీ ప్రసాదరావు అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–11లో గురుస్థానం ప్లే స్కూల్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి పటిష్టమైన పునాది ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌లోనే పడుతుందన్నారు. తల్లిదండ్రులు వారి చిన్నారులను ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌కు పంపించే ముందు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫరూఖీతో పాటు స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా, ప్రిన్సిపాల్ గౌసియా పాల్గొన్నారు.

ఘనంగా ఎర్నిమాంబ తొలేళ్ల సంబరం



గుర్రపు రథంపై ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయం వద్ద అమ్మవారి ఘటాలతో బయలుదేరారు. కొబ్బరితోట, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం పుట్టబంగారం వద్దకు వాటిని చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి. అనంతరం ఆలయం వద్ద మాలధారులైన భక్తులు అగ్నిగుండాలు తొక్కారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.